నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్
5 | నిజామాబాద్, బుధవారం 7 ఫిబ్రవరి 2024 | ADILABAD

సాయిబాబాను దర్శించుకున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే

ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు

ఖానాపూర్, ఫిబ్రవరి 6 : నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలో నిర్వహిస్తున్న శ్రీ సాయిబాబా ఆలయ 27వ వార్షికోత్సవంలో మంగళవారం మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, ఖానాపూర్ బీఆర్ఎస్ నేత జాన్సన్ నాయక్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారిని శాలువాతో సన్మానించారు. ఇందులో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు అంకం రాజేందర్, ప్రదీప్, సభ్యులు కట్కం శంకరయ్య, రామునాయక్ పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి..

శిక్షణను ప్రారంభిస్తున్న జిల్లా అధికారి రాజేశ్వర్‌గౌడ్

నిర్మల్ టౌన్, ఫిబ్రవరి 6 : నిరుద్యోగ అభ్యర్థులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు బీసీ స్టడీ సర్కిల్ ద్వారా అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజేశ్వర్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రూప్ 1,2 ,3 అభ్యర్థులకు నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. పోటీ పరీక్షలో విజయం సాధించేలా ప్రత్యేక శిక్షణను ఏర్పాటు చేశామని తెలిపారు. 60 రోజులపాటు శిక్షణ ఉంటుందన్నారు. గతంలో బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందిన అభ్యర్థులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ సహాయ అధికారి గంగాధర్, స్టడీ సర్కిల్ మేనేజర్ రవి, ఏవో ఖలీద్ పాల్గొన్నారు.

గిరిజనుల ఓట్ల కోసమే రేవంత్ ఇంద్రవెల్లి సభ

ఆదివాసులపై కాల్పుల పాపం కాంగ్రెస్ పార్టీదే..

- హంతకులే సంతాప సభ పెట్టినట్లు ఉన్నది..
- కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే గూడేల్లో ప్రగతి కాంతులు
- మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు విఠల్‌రెడ్డి

నిర్మల్, ఫిబ్రవరి 6(నమస్తే తెలంగాణ) : 40 ఏండ్ల క్రితం అప్పటి కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రిగా అంజయ్య ఉన్న సమయంలోనే ఇంద్రవెల్లిలో ఆదివాసులను బలి తీసుకున్నారని, నాటి ఇంద్రవెల్లి కాల్పుల పాపం ముమ్మాటికీ కాంగ్రెస్ పార్టీదేనని, ఓట్ల కోసమే సభ నిర్వహించారని మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. నాటి కాంగ్రెస్ ప్రభుత్వం జరిపిన కాల్పుల్లో అధికారికంగా 13 మంది, అనధికారికంగా 250 మంది వరకు చనిపోయారన్నారు. అప్పట్లో సంచలనం సృష్టించిన ఇంద్రవెల్లి పోలీస్ కాల్పుల ఘటనను యావత్ భారతదేశం ముక్తకంఠంతో ఖండించిందన్నారు. ఈ సంఘటన జరిగి 40 ఏళ్లు గడిచినా నేటికీ ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీ గిరిజనులకు అది మరువని జ్ఞాపకమని గుర్తు చేశారు. మంగళవారం నిర్మల్‌లోని బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షులు విఠల్‌రెడ్డి, ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్‌లతో కలిసి ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవలి ఇంద్రవెల్లి పర్యటనతో హంతకులే సంతాప సభ పెట్టినట్లు ఉందన్నారు. 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఏనాడు ఆదివాసులను పట్టించుకున్న పాపాన పోలేదని, కేవలం గిరిజనుల ఓట్ల కోసమే ఇంద్రవెల్లిలో రేవంత్ రెడ్డి సభ పెట్టారని ఆరోపించారు. ఈ సభలో కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులను దూషించడానికే రేవంత్‌రెడ్డి అధిక ప్రాధాన్యతనిచ్చారని, సీఎం మాట్లాడిన భాషపై చిన్న పిల్లలు, మహిళలు అసహ్యించుకుంటున్నారన్నారు. తమ ప్రాంతానికి సీఎం వస్తే అభివృద్ధి జరుగుతుందని, నిధులు మంజూరు చేస్తారని ఆదివాసులు అంతా ఆశించారని, వారి ఆశలను వమ్ము చేస్తూ గిరిజనుల అభివృద్ధికి సీఎం నయా పైసా మంజూరు చేయలేదని మండిపడ్డారు.

కేసీఆర్ పాలనలోనే గిరి గూడేల్లో ప్రగతి

కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన, ఆదివాసీ గూడేలు అభివృద్ధి చెందాయని మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. అడవి బిడ్డల సంక్షేమమే ధ్యేయంగా కేసీఆర్ సారథ్యంలోని గత ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేసిందన్నారు. తండాలు, గూడేలను పంచాయతీలుగా మార్చి 'మా ఊళ్లో–మా రాజ్యం' నినాదాన్ని సాకారం చేశామన్నారు. విద్య, వైద్యం, రవాణ సౌకర్యాలను మెరుగుపర్చడమే కాకుండా.. మారుమూల పల్లె బడుల్లో ఆంగ్ల విద్యను అందించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానికే దక్కుతున్నదన్నారు. కేసీఆర్ హయాంలోనే జోడేఘాట్‌కు ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. రూ.25 కోట్లతో కుమ్రం భీమ్ స్మారక చిహ్నం, గిరిజన మ్యూజియం.. జోడేఘాట్‌కు వెళ్లేందుకు రూ.15.95 కోట్లు వెచ్చించి రెండు వరుసల రహదారిని నిర్మించిందన్నారు. కాంగ్రెస్ పాలనలో నిత్యం మనం చూసిన కలరా, మలేరియా, విషజ్వరాలను మెరుగైన వైద్య సదుపాయంతో అరికట్టిన సంగతి ప్రతి గిరిజన బిడ్డకు తెలుసన్నారు. దశాబ్దాల పాటు కాంగ్రెస్ పార్టీ పట్టించుకుని పోడు భూముల సమస్యను కేసీఆర్ ప్రభుత్వమే పరిష్కరించి, దాదాపు 4 లక్షల ఎకరాలకు పైగా భూములకు పట్టాలిచ్చిందన్నారు.

45 రోజుల్లోనే రూ.14 వేల కోట్ల అప్పు

-విఠల్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, నిర్మల్.

పదేండ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది దేశానికే తలమానికంగా నిలిచిందని బీఆర్ఎస్ పార్టీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు విఠల్‌రెడ్డి అన్నారు. ఇక్కడ జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఇతర రాష్ట్రాలు కాపీ కొడుతున్నాయని తెలిపారు. గత 45 రోజల కాంగ్రెస్ పాలనలో రూ.14 వేల కోట్లు ఎందుకు అప్పు చేయాల్సి వచ్చిందో రాష్ట్ర ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ 45 రోజుల్లో పేర్లు మార్చడం తప్ప ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చే యలేదని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు చెప్పినట్లుగా 100 రోజుల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, లేకుంటే ప్రజాక్షేత్రంలో నిలదీస్తామని హెచ్చరించారు.

కేసీఆర్ హయాంలోనే నాగోబా ఆలయానికి రూ.6 కోట్లు

- జాన్సన్ నాయక్, ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి.

ఆదివాసుల ఆరాధ్య దైవం నాగోబా ఆలయ నిర్మాణానికి కేసీఆర్ ప్రభుత్వమే రూ. 6 కోట్లను మంజూరు చేసిందని బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్య జాన్సన్ నాయక్ అన్నారు. సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి ఇం ద్రవెల్లికి వచ్చి చిల్లి గవ్వ కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. సీఎం సభపై ఎన్నో ఆశలు పెట్టుకున్న ఆదివాసులకు నిరాశే మిగిలిందన్నారు. ఇంద్రవెల్లిని దత్తత తీసుకుంటున్నానని ప్రకటించడమే తప్ప అభివృద్ధికి నయాపైసా కేటాయించలేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను వెనక్కి తీసుకున్న ఘనత రేవంత్‌రెడ్డికే దక్కుతుందని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వం మున్సిపాలిటీలకు కేటాయించిన ఎస్‌డీఎఫ్ నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేయడం శోచనీయమన్నారు. కేసీఆర్‌ను, ఆయన కుటుంబాన్ని తిట్టడానికే ఇంద్రవెల్లికి వచ్చావా?అని సీఎం రేవంత్‌ను ప్రశ్నించా రు. ప్రజలు అవకాశం ఇచ్చారు. గత కేసీఆర్ పాలన కంటే మెరుగ్గా ఏం చేస్తారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. తప్పుడు హామీలిచ్చి కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కిందని, ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు ప్రజలతో కలిసి పోరాడుతామన్నా రు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, నాయకులు రాంకిషన్‌రెడ్డి, మారుగొండ రాము, రాంచందర్, నర్సాగౌడ్ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ ఉద్యోగులకు జీతాలు

● 'నమస్తే' ఎఫెక్ట్

బాసర, ఫిబ్రవరి 6 : బాసర ఆర్జీయూకేటీ అధికారులకు జీతాలు విడుదయ్యాయి. సోమవారం 'నమస్తే తెలంగాణ'లో ఈ విషయమై 'ట్రిపుల్ ఐటీ ఉద్యోగులకు అందని జీతాలు' శీర్షికన కథనం ప్రచురితమైంది. మంగళవారం స్పందించిన వీసీ జీతాలను విడుదల చేశారు. హైదరాబాద్ నుంచి బాసరకు చేరుకున్న ఆయన మంగళవారం ఉద్యోగుల జీతాలను అందజేయగా.. ఆయా అధికారుల అకౌంట్లలో జమ అయ్యాయి.

కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

కేసీఆర్ పేదింటి ఆడబిడ్డలకు మేనమామ

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

తాంసి(తలమడుగు), ఫిబ్రవరి 6 : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి జరిగిందని, కేసీఆర్ పేదింటి ఆడబిడ్డలకు మేనమామ అని, అందుకే కల్యాణలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ముందుగా ఎమ్మెల్యేకు గ్రామస్తులు స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని యావత్ భారతదేశానికి తలమానికంగా అభివృద్ధి పథంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీసుకవెళ్లారని గుర్తు చేశారు. అధికారంలో వచ్చి రెండు నెలలు గడిచినా పూర్తిస్థాయిలో రైతు బంధు ఇవ్వడంతో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. అనంతరం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసి వార్డు సభ్యులను సన్మానించారు. జడ్పీటీసీ గణేశ్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల శాఖ కన్వీనర్ వెంకటేశ్, తహసీల్దార్ రాజ్‌మోహన్, మాజీ సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మర్రిచెట్టు వద్ద ఎడ్లబండ్లతో ఏర్పాటు చేసిన గుడారాల్లో మెస్రం వంశీయులు

మర్రిచెట్ల కింద మెస్రం వంశీయులు

- మహాపూజపై పటేళ్ల తో చర్చలు
- కొనసాగుతున్న ప్రత్యేక పూజలు

మర్రిచెట్ల వద్ద ఎర్పాటు చేసిన గుడారం వద్ద మహిళలు, నైవేద్యాల బుట్టల వద్ద వెలిగించిన దీపాలు

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 6 : కేస్లాపూర్‌లోని మర్రిచెట్ల వద్దకు సోమవారం రాత్రి పవిత్ర గంగాజలం(ఝరి)తో మెస్రం వంశీయులు చేరుకుని ఏర్పాటు చేసుకున్న గుడారాల్లో బస చేశారు. ఝరిని టేకు చెట్టుపై పెట్టారు. మంగళవారం ఉదయం సంప్రదాయ పూజలు నిర్వహించి దేవతను దర్శించుకున్నారు. వెదురు బుట్టల్లో నైవేద్యాలను పెట్టి, దీపాలు వెలిగించారు. మర్రిచెట్ల కింద కూర్చొని చర్చాగోష్ఠి నిర్వహించారు. మెస్రం వంశీయుల పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్‌పటేల్‌తోపాటు ఆయా గ్రామాల నుంచి వచ్చిన మెస్రం వంశీయుల పటేళ్లు, పర్ధాంజీలు మెస్రం దాదారావ్, నాగోబా పేన్ కొత్వాల్ తిరుపతి, గణపతితోపాటు పటేళ్లను సంప్రదాయం ప్రకారం మర్రిచెట్ల వద్దకు ఆహ్వానించారు. మర్రిచెట్ల వద్ద పటేళ్లు, పర్ధాంజీలు వేర్వేరుగా కూర్చొని కచేరీ నిర్వహించారు. మట్టికుండలను తీసుకోరావడంతోపాటు పెద్దల పేరిట నిర్వహించే(కర్మ కాండలు) తుమ్ కార్యక్రమంపై చర్చించారు.

ఝరి పేరిట వెలిగించిన దీపం

అధికారుల పరిశీలన

ఆయా శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. ఎస్పీ గౌష్ ఆలంతోపాటు డీఎల్‌పీవో భిక్షపతిగౌడ్, ఎంపీడీవో పుష్పలత సిబ్బందికి ఏర్పాట్లపై సూచనలు చేశారు.

కోనేరుకు పూజలు చేస్తున్న మెస్రం వంశీయులు

ప్రత్యేక పూజలు చేస్తున్న మెస్రం వంశీయులు

నాగోబా మహాపూజకు మెస్రం వంశీయులు

ఎడ్ల బండ్ల ద్వారా 20 కుటుంబాల పయనం

దస్తురాబాద్, ఫిబ్రవరి 6 : మున్యాల గొండు గూడెం, మల్లాపూర్, భూత్కూర్, చెన్నూర్ గ్రామాలకు చెందిన మెస్రం వంశీయులు మంగళవారం ఎడ్ల బండ్లు, కాలి నడకన కేస్లాపూర్‌లోని నాగోబా మహాపూజకు బయలుదేరారు. అంతకు ముందు మెస్రం కుల దేవతలకు పూజలు చేశారు. ఈ నెల 9 వ తేదీన కేస్లాపూర్‌లోని నాగోబాకు నిర్వహించే మహా అభిషేకంలో పాల్గొంటామని మెస్రం పెద్ద పటేల్ భీంరావు తెలిపారు. మంగళవారం ఇంద్రవెల్లిలోని మర్రిచెట్టు వద్ద బస చేసి, మరుసటి రోజు బుధవారం కేస్లాపూర్‌కు చేరుకుంటామని పేర్కొన్నారు. మహాపూజ సందర్భంగా తమ ఎడ్లు, ఎడ్ల బండ్లను అందంగా అలంకరించారు. చలి, వర్షానికి తట్టుకునేలా చిన్న ఇంటి నిర్మాణం మాదిరిగా ఏర్పాటు చేసుకుని నాగోబా దర్శనానికి తరలివెళ్తామని తెలిపారు.

అందంగా తీర్చిదిద్దిన ఎండ్ల బండి

'నాగోబా'ను సక్సెస్ చేద్దాం..

- కేస్లాపూర్‌లో 9 నుంచి 15వ తేదీ వరకు జాతర
- 9వ తేదీన మహాపూజ.. 12న ప్రజాదర్బార్..
- భక్తులకు సకల సౌకర్యాలు కల్పించాలి..
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ రాహుల్‌రాజ్

దర్బార్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 6 : ఈనెల 9 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించే నాగోబా జాతరను విజయవంతం చేద్దామని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. మంగళవారం నాగోబా దర్బార్ హాల్‌లో జిల్లాస్థాయి అధికారులతో జాతర ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా శాఖలవారీగా చేసిన ఏర్పాట్ల పనులతోపాటు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించి చేపట్టే పనుల వివరాలను శాఖలవారీగా అధికారులతో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాలతోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తారని, ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని అధికారులను ఆదేశించారు. నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మర్రిచెట్లతోపాటు గోవాడ్ ప్రాంతంలో ఉండే మెస్రం వంశీయులకు మరుగుదొడ్లతోపాటు స్నానపు సౌకర్యాలు కల్పించి నీటి సరఫరా చేయాలన్నారు. భక్తుల రద్దీ ఉండే ప్రాంతంలో పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు చేస్తూ శుభ్రంగా ఉంచాలన్నారు. ప్రధాన ప్రాంతాల్లో బారికేడ్లు, ప్రత్యేక పార్కింగ్, సీసీ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. 24 గంటలు విద్యుత్ సరఫరా చేసి ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించాలని సూచించారు. జనరేటర్లు అందుబాటులో ఉంచాలన్నారు. అన్ని రకాల ఏర్పాట్లను శాశ్వతంగా ఉండేలా చేపట్టాలని పేర్కొన్నారు. శాఖలవారీగా అధికారులకు ఇచ్చిన జాతర ఏర్పాట్ల పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం ప్రభుత్వ స్టాల్స్ ఏర్పాటు స్థలాన్ని పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు.

అన్ని సౌకర్యాలు కల్పించాలి : ఎమ్మెల్యే బొజ్జు

నాగోబా జాతరను పురస్కరించుకుని జాతరకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సూచించారు. నాగోబా దర్బార్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఏర్పాట్లపై సమీక్షలో మాట్లాడారు. త్వరలోనే మెస్రం వంశీయులను సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులను కల్పిస్తామన్నారు. అధికారులు కలిసి కట్టుగా సమన్వయంతో జాతరను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ గౌష్ ఆలం, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో ఖుష్బూ గుప్తా, శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్‌మహతో, ఐటీడీఏ ఏవో రామ్‌బాబు, అదనపు డీఆర్డీవో రవీందర్, బీఈఈ కళాశాల ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, ఐటీడీఏ ఈఈ భీంరావ్, డీఎల్‌పీవో భిక్షపతి గౌడ్, విద్యుత్ శాఖ ఏఈ రోహిదాస్, ఆలయ ఈవో రాజమౌళి, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో పుష్పలత, డీఎస్పీ నాగేందర్, సీఐ రామకృష్ణ, ఎస్ఐ సునీల్, మెస్రం వంశీయులు పాల్గొన్నారు.

చిత్రంలో కనిపిస్తున్నది ఆదిలాబాద్ నుంచి బేలకు పోయే రహదారి. కాంగ్రెస్ పాలనలో ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే సాహసం చేయాల్సి వచ్చేది. రోడ్డు సరిగా లేకపోవడంతో బస్సు కూడా వచ్చేది కాదు. ప్రజలు జీపుల్లో టాప్‌పైన కూర్చొని ప్రయాణం చేసేవారు. వానకాలంలో రోడ్డుపై పెద్ద గుంతలు ఏర్పడి రాకపోకలు సాగేవి కావు. గర్భిణులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు వైద్యం కోసం బేల నుంచి ఆదిలాబాద్‌కు రావాలంటే 2 గంటల సమయం పట్టేది.

ఆదిలాబాద్ జిల్లాలో మెరుగైన రహదారులు

రోడ్లు సూపర్

- కేసీఆర్ హయాంలోనే రాచమార్గాలు
- రూ. 743 కోట్లతో రోడ్లు, వంతెనల నిర్మాణం
- సమైక్య రాష్ట్రంలో పట్టని కాంగ్రెస్ పాలకులు
- సీఎం రేవంత్ తాజా వ్యాఖ్యలపై జిల్లావాసుల గరంగరం

> ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం ఈ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టింది. రూ. 55 కోట్లతో 32 కిలోమీటర్ల రహదారిని నిర్మించింది. రోడ్డు మధ్యలో నాలుగు వంతెనలు సైతం నిర్మించారు. దీంతో రాత్రి, పగలు తేడా లేకుండా ప్రజలు ప్రయాణం సాగిస్తున్నారు. 45 నిమిషాల్లో బేల నుంచి ఆదిలాబాద్‌కు చేరుకుంటున్నారు.

ఆదిలాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి రాష్ట్రంలో ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా రహదారుల పరిస్థితి అధ్వానంగా ఉండేది. గ్రామాల నుంచి మండలాలు, జిల్లా కేంద్రానికి రావాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. వానకాలంలో చిన్నపాటి వర్షాలకు రోడ్లపై నీరు ప్రవహించి రాకపోకలు నిలిచిపోయేవి. వివిధ గ్రామాల నుంచి ప్రజలు తమ అవసరాల కోసం మండల కేంద్రాలు, జిల్లా కేంద్రానికి రావాలంటే నరకయాతన అనుభవించేవారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పాలకుల నిర్లక్ష్యం ఫలితంగా ప్రజలకు ప్రయాణం ప్రాణ సంకటంగా మారేది. తమ గ్రామాలకు రవాణా సౌకర్యం కల్పించాలని ప్రజలు ఎన్నో సార్లు మొరపెట్టుకున్నా ఉమ్మడి రాష్ట్రంలో పాలకులు కరుణించని పరిస్థితి. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో రహదారుల అభివృద్ధికి పకడ్బందీ చర్యలు చేపట్టింది. రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో జిల్లాలోని ఏజెన్సీ గ్రామాలు మొదలుకుని జిల్లా కేంద్రం వరకు రహదారులు నిర్మించారు. పదేళ్లలో జిల్లాలోని మూడు శాఖల ఆధ్వర్యంలో రూ. 743 కోట్లతో 478 పనులు చేపట్టారు. వివిధ గ్రామాలకు పోయే రోడ్లకు అడ్డంగా ఉన్న వాగులపై 20 వంతెనలు నిర్మించారు. దీంతో ఆదిలాబాద్ జిల్లాలోని పలు గ్రామాలకు మెరుగైన రవాణా సౌకర్యం కలిగింది. ఇటీవల ఇంద్రవెల్లి పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాలో కేసీఆర్ ప్రభుత్వం ఎలాంటి రోడ్లు నిర్మించలేదని వ్యాఖ్యనించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆదివాసీ గూడాలు, గిరిజన తండాల రవాణా సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకున్నది. ఇందులో భాగంగా జిల్లాలోని మట్టి రోడ్లు ఉన్న గిరిజన గ్రామాలకు బీటీ రోడ్లను నిర్మించడానికి అవసరమైన నిధులు మంజూరు చేసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ. 233.18 కోట్లతో 278 రోడ్ల పనులను గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో చేపట్టనున్నారు. గిరిజన గ్రామాలకు గతంలో ఎన్నడూ లేని విధంగా బీటీ రోడ్లు, నిధులు మంజూరు చేయడంతో ప్రజలు ఏడాది పొడవునా సాఫీగా రాకపోకలు సాగించనున్నారు.

పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధం

నిర్మల్ టౌన్, ఫిబ్రవరి 6 : పార్లమెంట్ ఎన్నికలకు పూర్తిగా సన్నద్ధం అవుతున్నట్లు కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీకృత భవనం వద్ద గోదాములలో భద్రపరిచిన ఈవీ ఎంలను తనిఖీ చేశారు. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు ఓటరు జాబితాతో పాటు మార్పులు–చేర్పులు, ఈవీఎం మిషన్లను సన్నద్ధం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, రాజకీయ పార్టీల నాయకులు రవికుమార్, శ్రావణ్‌రెడ్డి, మజర్ పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయాలి..

- 28 వరకు వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలి..
- ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్

ఎదులాపురం, ఫిబ్రవరి 6 : గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. మంగళవారం స్థానిక రత్న గార్డెన్‌లో ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తాతోకలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 7 నుంచి 15వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఇంటింటికీ తాగునీరు అందించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి రెండు నెలలకోసారి జరిగే గ్రామసభలకు ప్రత్యేకాధికారులు అధ్యక్షత వహిస్తారని.. ఆదాయ, వ్యయాలను సమీక్షిస్తారని, గ్రామాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి ఈ గ్రామ్ స్వరాజ్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ఈ నెల 28వ తేదీ వరకు వంద శాతం ఇంటి పన్నులు వసూలు అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. డీపీవో శ్రీనివాస్, డీఆర్‌డీఏ కిషన్, మిషన్ భగీరథ ఎస్ఈ సురేశ్ పాల్గొన్నారు.